ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -168 | పేజీలు - 8 | వెల - 03/- | బుధవారం 24 సెప్టెంబర్ 2025

# జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

**దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న మోహన్‌లాల్**

**ఉత్తమ నటులుగా షారుఖ్ ఖాన్, విక్రాంత్ మస్సే, ఉత్తమ నటిగా రాణి ముఖర్జీలకు అవార్డుల ప్రదానం**



**ఢిల్లీ సెప్టెంబర్, 23, (రిపబ్లిక్ న్యూస్):** 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. అవార్డుల విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ హాజరయ్యారు. ఈ వేడుకలో మలయాళం సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందజేశారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. అలాగే ఉత్తమ నటుడి అవార్డును షారూఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12 ఫెయిల్), మిగతా 2లో...

# ప్రజల సొమ్ముతో పండుగ కానుకలు వద్దు..

**కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఆదేశాలు -దీపావళి సందర్భంగా ఆర్థిక శాఖ నిర్ణయం**

**మంత్రిత్వ శాఖలకు తాజాగా ఆదేశాల జారీ -ఆర్థిక క్రమశిక్షణ కోసమే నిర్ణయమని వెల్లడి**




**ఢిల్లీ సెప్టెంబర్, 23, (రిపబ్లిక్ న్యూస్):**దీపావళి పండుగ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఉత్తర్వులు వెలువరించింది. పండుగ సంతోషాన్ని పంచుకునేందుకు ప్రజల సొమ్ము వెచ్చించవద్దని ఆదేశించింది. ఇతర పండుగల సమయాల్లోనూ కానుకల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేయొద్దని మంత్రిత్వ శాఖలకు స్పష్టం చేసింది. ఆర్థిక క్రమశిక్షణకు, అనవసర వ్యయాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొంది. ప్రజావనరులను మరింత సమర్థవంతంగా వినియోగించేలా ప్రభుత్వ విభాగాలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేస్తుంది. ఇందులో భాగంగానే తాజాగా ఈ నోటీసులు పంపింది. ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహించడం, అనవసర ఖర్చులను నియంత్రించడంపై ఆర్థిక శాఖ వ్యయ విభాగం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే దీపావళి సహా ఇతర పండగలకు బహుమతుల కోసం మంత్రిత్వ శాఖలు ఎలాంటి ఖర్చు చేయరాదని నోటీసుల్లో పేర్కొంది.

# పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు

## మెడికల్ కాలేజీలపై అసత్య ప్రచారం



- ఆ విధానంవల్ల ఎంతో మేలు
- వేగంగామౌలిక వసతుల కల్పన సాధ్యం
- పేదలకు ఉచిత సేవలు.. మరిన్ని మెడికల్ సీట్లు
- రెండేళ్లలోనే ఆసుపత్రుల నిర్మాణం పూర్తి
- ప్రాజెక్టులు పూర్తయ్యాక మళ్లీ ప్రభుత్వం చేతికే
- వాస్తవాలతో పవర్పాయింట్ ప్రజెంటేషన్
- విపక్షం విమర్శలకు దీటుగా జవాబు
- వారి విధానంలో వెళితే 15 ఏళ్లయినా 17 కాలేజీల నిర్మాణం పూర్తికాదని ఎద్దేవా

అమరావతి, **సెప్టెంబర్, 23, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలనిర్మాణానికి సంబంధించి అనుసరిస్తున్న పీపీపీ విధానంపై విపక్ష వైసీపీ చౌకబారు రాజకీయాలు చేస్తోందని, వాస్తవాలేమిటో ప్రజలకు చెబుతున్నామని, వారి విమర్శలను తిప్పికొడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విపక్షం అసత్య ప్రచారాన్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీలో వైద్యారోగ్యంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వైసీపీ విమర్శలను తిప్పికొట్టారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు... పీపీపీవల్లే వేగంగా మౌలిక వసతులు వస్తాయి, పేదలకు మరిన్ని సీట్లు దక్కుతాయి, సేవలు ఉచితంగానే అందుతాయి" అని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిన 17 కాలేజీలకు ఐదేళ్లలో 18 శాతం ఖర్చు పెట్టారని బహిర్గతం చేస్తూ... కూటమి ఏడాదిలోనే 9 శాతం ఖర్చు పెట్టింది. మిగతా 2లో...

# మాటల మంటలు

## తల్లికి వందనంపై మండలిలో వాడీవేడి చర్చ


2లో.

- కొందరికే ఇస్తూ..అబద్ధాలుచెబుతున్నారు
- సర్కార్ తీరుపై మండిపడ్డ విపక్షనేత బొత్స
- అందరికీ ఇస్తున్నామని..ఫీజు బకాయిలపై చర్చకు సిద్ధం
- మండలిలో విపక్ష సభ్యుల ప్రశ్నలకు లోకేవ్ సమాధానం
- హోంమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా వైకాపా వాకౌట్

తల్లికి వందనం పథకంపై వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి నారా లోకేష్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మంగళవారం శాసనమండలి సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా తల్లికి వందనం లబ్ధిదారులు ఎంతమంది అంటూ శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.


2లో.

తిరుమల బ్రహ్మోత్సవాలకు

# శ్రీకారం

**శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం**

# మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా ఇవ్వాలి

- కుంభమేళా చేసుకున్న పుణ్యమేంది
- మేడారం చేసుకున్న పాపమేంది
- కేంద్రానికి సిఎం రేవంత్ డిమాండ్
- మేడారం సందర్శన..అభివృద్ధిపై సమీక్ష
- జాతర లోగా పనుల పూర్తికి ఆదేశాలు
- గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు
- నిలువెత్తు బంగారం సమర్పించిన రేవంత్

2లో.



# లోకేశ్ తీర్మానానికి వైసీపీ మద్దతు




**విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు**

**శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి నారా లోకేశ్**

**ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ఇస్తామని బొత్స వెల్లడి**

అమరావతి, **సెప్టెంబర్, 23, (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మంగళవారం అత్యంత వాడివేడిగా, నాటకీయ పరిణామాల మధ్య సాగాయి. రాష్ట్రానికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ఓ కీలక తీర్మానం సభలో సంచలనం సృష్టించగా, ప్రతిపక్ష వైసీపీని ఇరకాటంలో పడేసింది. అనూహ్యంగా, ఆ తీర్మానానికి వైసీపీ మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. మిగతా 2లో...

## పిసి ఘోష్ కమిషన్

# నివేదికను కొట్టేయండి

**హైకోర్టులో సవాల్ చేసిన ఐఎఎస్ స్మితా సబర్వాల్**



**హైదరాబాద్,సెప్టెంబర్, 23, (రిపబ్లిక్ న్యూస్):** సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టులో ఆమె సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతరమిగతా 2లో...

# 2026 మార్చి 31 వరకు పాత ఎమ్మార్పీతో అమ్మకాలకు అనుమతి

- పాత ఎమ్మార్పీ వస్తువులపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..
- ఏపీలో జీఎస్టీ తగ్గింపుతో మారిన ఎమ్మార్పీ ధరలు
- పాత స్టాక్ విక్రయాలపై ప్రభుత్వం కీలక సడలింపులు
- జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు చేరాలన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- అధిక ధరలకు అమ్మితే 1967కు ఫిర్యాదు చేసే అవకాశం



అమరావతి, **సెప్టెంబర్, 23, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీలో జీఎస్టీ రేట్లు తగ్గడంతో ఇప్పటికే ప్యాక్ చేసి ఉన్న పాత సరుకుల విక్రయంపై నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించింది. మిగతా 2లో...

# పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు

**(మొదటి పేజి తరువాయి)**

మరో 15 ఏళ్లు పడుతుంది" అని ధాటిగా ఎండగట్టారు. అసెంబ్లీ వేదికగా చంద్రబాబు నాయుడు సమర్పించిన వివరాలు ఒకవైపు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేస్తే, మరోవైపు పీపీపీ విధానంపై వస్తున్న అపోహలను నివృత్తి చేశాయి. కన్వీనర్ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మంగళవారం ఓ అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఒక్క సరదా వ్యాఖ్యతో సభ నవ్వులతో నిండిపోయింది. వైద్యారోగ్య శాఖపై జరుగుతున్న చర్చలో ఆయన చేసిన చమత్కారానికి డిప్యూటీ స్పీకర్‌తో సహా సభ్యులందరూ పగలబడి నవ్వారు.

వైద్యారోగ్య శాఖపై చర్చకు సమాధానమిస్తూ సీఎం చంద్రబాబు ప్రజల ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతున్నారు. "మనిషి ఆయుర్దాయం 120 ఏళు.. కానీ మనం 40 ఏళ్లకే 120 ఏళ్లకు సరిపడా ఆహారాన్ని తినేస్తున్నాం" అని చెబుతూ, ఒక్కసారిగా సభను అధ్యక్ష స్థానం నుంచి నడిపిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వైపు చూశారు. నవ్వుతూ.. "అధ్యక్షా, ఇది మీకు కూడా వర్తిస్తుంది!" అనడంతో సభలో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి. ఈ అనూహ్యమైన వ్యాఖ్యకు డిప్యూటీ స్పీకర్ కూడా నవ్వు ఆపుకోలేకపోయారు.

గతంలో కొందరు పోలీసులు పొట్టలు పెంచుకోవడం చూసి, తగ్గించుకోమని వాళ్లకు స్పష్టం చేశానని చంద్రబాబు వెల్లడించారు. అంతేకాదు, తన వైద్యులు కూడా ఇలాగే కనిపించారని... దాంతో, "డాక్టర్లే పేషెంట్లయితే ఎలా? డాక్టరుగా నువ్వు నాకు ట్రీట్‌మెంట్ ఇవ్వడం కాదు, ముందు నీకు నువ్వు ట్రీట్‌మెంట్ ఇచ్చుకో." అని చెప్పేవాడ్నని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ఈ సరదా సంభాషణ అనంతరం చంద్రబాబు ఆరోగ్య పరిరక్షణపై కీలక ప్రసంగం చేశారు. "ఆహారమే ఔషధం, మన వంటగదే ఓ ఫార్మసీ" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. అనారోగ్యాలకు అతిగా తినడమే ప్రధాన కారణమని, తాను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎప్పుడూ సెలవులు తీసుకోకపోవడానికి క్రమశిక్షణతో కూడిన జీవనశైలే కారణమని తెలిపారు. ప్రజలు తమ జీవనవిధానంలో మార్పులు చేసుకోవాలని, ఉప్పు, పంచదార, నూనె వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని సూచించారు. రోజుకు 8 గంటల ప్రశాంతమైన నిద్ర అవసరమని నొక్కిచెప్పారు.

రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసి, ఒక్కొక్కరికీ 41 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డును సిద్ధం చేస్తామని ప్రకటించారు. దీనితో పాటు రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి రూ. 2.5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చుల కంటే గదుల అద్దెలే భారంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# మండలిలో మాటల మంటలు

అమరావతి,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): తల్లికి వందనం పథకంపై వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి నారా లోకేష్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మంగళవారం శాసనమండలి సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా తల్లికి వందనం లబ్ధిదారులు ఎంతమంది అంటూ శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమ్మఒడి రాలేదు తల్లికి వందనం వస్తోందంటూ వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పేరిట కొందరికే పథకాన్ని పరిమితం చేశారని విమర్శించారు. తల్లికి వందనం కింద కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15వేలు ఇస్తోందని లోకేశ్ వివరించారు. పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ వర్కర్లకు తల్లికి వందనం వర్తించట్లేదని మండలి ఛైర్మన్ అడిగారు. అందరికీ వర్తించేలా జీవో లేదా మెమో ఉందా అని మంత్రిని ప్రశ్నించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తించేలా జీవో ఉందంటూ జీవోలోని అంశాన్ని ఛైర్మన్‌కు చదివి వినించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తమకూ వర్తింపచేయాలనే వినతి ప్రభుత్వ పరిశీలనలో ఉందని.. చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇకపోతే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంత్రిగా అన్ని అంశాలు చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. వైకాపా హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందిగాక.. మాపై విమర్శలా? అని వైకాపా సభ్యులను లోకేశ్ నిలదీశారు. గత ప్రభుత్వ పాలనలో ఏ ఏడాది ఎంత బకాయి పెట్టారో అందరికీ తెలుసన్నారు. సభలో తాను పరుష వ్యాఖ్యలు చేసినట్లు- బొత్స చేసిన విమర్శలు అవాస్తవమన్నారు. అలా తాను ఏం మాట్లాడానో చెప్పాలన్నారు. బొత్స సీనియార్టీని గౌరవిస్తానని.. తప్పుడు ప్రచారం చేయొద్దని లోకేశ్ హితవు పలికారు. శాసనసభ సమావేశాలకు దూరంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ... శాసన మండలిలో మాత్రం ప్రభుత్వాన్ని నిలదీస్తోంది.. దీంతో, మండలిలో కూటమి వర్సెస్ వైసీపీగా మారింది పరిస్థితి.. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం అన్నారు.. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. సమాజంలో మార్పు రావాలంటే నైతిక విలువలు పెంపొందాలి అన్నారు.. ప్రభుత్వం చాగంటి కోటేశ్వరరావు సలహాదారుగా పెట్టుకున్నాం.. ఆయన రాసిన పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు అందిస్తున్నాం.. ఆయన ఒక్క రూపాయి జీతం, ఇతర సౌకర్యాలు ఏమీ తీసుకోకుండా పనిచేస్తున్నారని వెల్లడించారు.. ఎస్సీ, బీసీ విద్యార్థులకు విడిగా క్లాసులు పెట్టామన్న సమాచారం ఉంటే ఇవ్వండి.. చర్యలు తీసుకుంటాం అన్నారు మంత్రి లోకేష్.. అయితే, సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలకు పొంతన లేదని విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు.. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రశ్న అడిగాం.. ఫీజుల నియంత్రణ కోసం కమిటీ- వేస్తున్నామా? లేదా? అని అడిగాం.. ఆర్టీఈ యాక్ట్ గురించి తీసుకున్న చర్యలేంటి అని ప్రశ్నించారు బొత్స.. అయితే, నేను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. ప్రభుత్వం 50 వేల మంది పిల్లలకు ఆర్టీఈ ప్రకారం విద్యను అందించాం అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.. శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ తిరస్కరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై వైఎస్సార్‌సీపీ చర్చకు పట్టుబట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మంత్రి నారా లోకేష్ అబద్ధపు వ్యాఖ్యలను ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. మేం బకాయి పెట్టినట్లు- లోకేష్ చేస్తున్న వ్యాఖ్యలు అవాస్తవం అని బొత్స మండిపడ్డారు. ఈ క్రమంలో మంత్రి నారా లోకేష్‌కు మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణల మధ్య వాగ్వివాదం జరిగింది. సభలో

సీనియర్, జూనియర్ అనే తేడాలు ఉండవు. ఎవరైనా సభా మర్యాదలు పాటించాలి. కొన్ని పరుష పదాలు వాడకూడదు.. కొన్ని నేర్చుకోండి. మంత్రి లోకేష్ చెప్పినట్లుగా మేం బకాయిలు పెట్టామన్నది అవాస్తవం. చర్చకు రండి మేము సిద్ధంగా ఉన్నాం. సభను తప్పుదోవ పట్టించి ప్రజలు మధ్య పెడితే కుదరదని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో అవుట్ సోర్సింగ్ వర్కర్లకు పథకం అమలు అయ్యింది.. వారికి ఇప్పుడు నిలిపివేశారు.. వారికి అమలు చేసే అవకాశం ఉందా? అంటూ మండలి ఛైర్మన్ మోషేన్ రాజు.. మంత్రి లోకేష్‌ను అడిగారు మున్సిపాలిటీల్లో పనిచేసే వర్కర్స్ జీతాలు 12 వేలు.. రూరల్ ప్రాంతంలో 10 వేల కంటే తక్కువ ఉన్నవారికి పథకం వర్తిస్తుందని మంత్రి లోకేష్. సమాధానమిచ్చారు. మున్సిపాలిటీలో 18 వేలు వేతనం ఉంది.. మీరు 12 వేలు నిబంధన పెడితే పథకం ఏ విధంగా వాళ్లకు అందుతుందంటూ మండలి ఛైర్మన్ ప్రశ్నించారు. దీంతో పరిశీలిస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. తల్లికి వందనంపై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, బొమ్మి ఇజ్రాయేలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థుల కోసం అమ్మఒడి కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. ఈ ప్రభుత్వం దాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం అని పేరు పెట్టారు. 67 లక్షల మందికి విద్యార్థులకు పథకం ఇస్తామని 54 లక్షల మందికి మాత్రమే ఇచ్చారు. మొదటి ఏడాది ఎగ్గొట్టారు.. రెండో ఏడాది అరకొరగా ఇచ్చారు. నిబంధనల పేరుతో అనర్హుల సంఖ్యను పెంచారు. కరెంట్ బిల్లు 300 దాటినా పథకం కట్ చేశారని అన్నారు. ఇకపోతే శాసన మండలి నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. హోంమంత్రి అనిత వ్యాఖ్యలకు నిరసనగా వాకౌట్ చేశారు. హోంమంత్రి వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు.

# మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా ఇవ్వాలి

ములుగు **సెప్టెంబర్, 23, (రిపబ్లిక్ న్యూస్):**
ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు-చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈ పనులతో మంత్రి సీతక్కతోపాటు- తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. సమ్మక్క- సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క - సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చానని వివరించారు. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం. మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు మేడారం ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తెలుసుకున్నారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు. ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వనదేవతలను సందర్శిస్తున్నా. ప్రకృతి వైపరీత్యాలనూ తట్టు-కునేలా శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లను అధికారులు పూజారులకు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలపై ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, వారి ఏకాభిప్రాయం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీల సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు- స్పష్టం చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి సంప్రదాయాలు, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని.. వారి సంప్రదాయంలో ఏమాత్రం మార్పు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధిని డబ్బులతో కాకుండా భక్తితో చూడాలని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా పనులు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

ఇంకా ఆలయ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు- చేయాలని కూడా సూచించారు. తన రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్ని-కై-నప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకుంటున్నానని అమ్మవార్ల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆదివాసీల పోరాటానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తి అని కొనియాడారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఏ సంక్షేమ పథకం అయినా ఆదివాసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని అన్నారు. సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం మా జీవితంలో గొప్ప ఘట్టం. ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధం. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు, పూజారులు, సంప్రదాయ కుటుంబాలందరినీ భాగస్వాములను చేస్తున్నాం అని స్పష్టం చేశారు. మహాజాతరకు ముందే పనులు పూర్తిచేసేలా అధికారులు పగలు, రాత్రి పనిచేయాలని ఆదేశించారు. భక్తితో, సమ్మక్క మాలధారణ చేసినట్లుగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అదే సమయంలో, కేంద్రంపై విరుచుకుపడిన సీఎం రేవంత్ రెడ్డి, కుంభమేళాకు వేలకోట్లు- ఇస్తున్న కేంద్రం, ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరకు నిధులు ఎందుకు ఇవ్వడంలేదు? జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని, నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని స్పష్టం చేశారు. మహాజాతర సమయంలో తిరిగి వచ్చి, ఈ జాతరను మరింత ఘనంగా నిర్వహిస్తామని భక్తులకు హామీ ఇచ్చారు. చివరగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ పూజారులను సత్కరించారు. అలాగే ఆయన నిలువెత్తు బంగారాన్ని అమ్మవారికి సమర్పించారు.

# జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

**(మొదటి పేజి తరువాయి)**

ఉత్తమ నటి అవార్డును రాణి ముఖర్జీలకు (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ "దాదా ఫాల్కే పురస్కారాన్ని నేను అందుకుంటానని నేను కలలో కూడా ఊహించలేదు. ఇదంతా మ్యాజిక్‌లా అనిపిస్తోంది. ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ పురస్కారం నా ఒక్కడికే కాదు మలయాళ చిత్ర పరిశ్రమకు చెందుతుంది"అని అన్నారు. ఈ వేడుకలో టాలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రంగా 'భగవంత్ కేసరి' ఎంపిక కాగా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి పురస్కారాలు స్వీకరించారు. సాయి రాజేష్ (ఉత్తమ స్క్రీన్ ప్లే %-% బేబీ సినిమా), పివిఎస్ రోహిత్ (ఉత్తమ నేపథ్య గాయకుడు %-% బేబీ సినిమా), ప్రశాంత్ వర్మ (బెస్ట్ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్ %-% హనుమాన్ సినిమా), హర్షవర్ధన్ రామేశ్వర్ (ఉత్తమ నేపథ్య సంగీతం %-% యానిమల్ మూవీ), సుకృతి వేణి(ఉత్తమ బాల నటి %-% గాంధీ తాత చెట్టు) అవార్డులు అందుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన బలగం సినిమాలోని 'ఊరు పల్లెటూరు' అనే పాటకు ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్ జాతీయ అవార్డు అందుకున్నారు. హనుమాన్ సినిమాకు గాను బెస్ట్ యాక్షన్ విభాగంలో స్టంట్ కొరియోగ్రాఫర్లు నందు, పృథ్వీ జాతీయ పురస్కారాలు స్వీకరించారు. అదేవిధంగా వివిధ విభాగాలలో విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులను అందజేశారు.

# లోకేశ్ తీర్మానానికి వైసీపీ మద్దతు

## విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు

## శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి నారా లోకేశ్

## ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ఇస్తామని బొత్స వెల్లడి

**(మొదటి పేజి తరువాయి)**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మంగళవారం అత్యంత వాడివేడిగా, నాటకీయ పరిణామాల మధ్య సాగాయి. రాష్ట్రానికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ఓ కీలక తీర్మానం సభలో సంచలనం సృష్టించగా, ప్రతిపక్ష వైసీపీని ఇరకాటంలో పడేసింది. అనూహ్యంగా, ఆ తీర్మానానికి వైసీపీ మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విజయవంతంగా అడ్డుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి అభినందనలు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు సమర్పిస్తూ మంత్రి నారా లోకేశ్ మండలిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి, రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఐక్యతను చాటాలని ఆయన కోరారు. అయితే, ఈ సమయంలో జోక్యం చేసుకున్న వైసీపీ సభ్యులు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా కేంద్రం ఇంకా అడుగులు వేస్తోందంటూ తీర్మానాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని మేం వందసార్లు చెప్పాం. అయినా మీకు స్పష్టత లేదా? ప్రైవేటీకరణ ఆగిపోయిందని మీరే చెబుతూ, మళ్లీ మీరే సభను తప్పుదోవ పట్టిస్తారా?" అని నిలదీశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతూ లోకేశ్ విమర్శలు గుప్పించారు. "మా ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని దాదాపు 80 శాతానికి తీసుకువచ్చాం. మీ హయాంలో అది 48 శాతానికి పడిపోయింది. రూ.25 వేల కోట్ల అప్పులు మిగిల్చారు. అలాంటి మీరు మాట్లాడతారా? మేం సొంత కేసుల కోసం ఢిల్లీ వెళ్లడం లేదు. దేశ ప్రయోజనాల కోసమే ఎన్డీయేకు బేషరతుగా మద్దతు ఇస్తున్నాం. కేంద్రంతో గొడవలు పెట్టుకోం, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరిస్తాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. తాను ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నారా, లేదా వ్యతిరేకిస్తున్నారా? అని వైసీపీని సూటిగా ప్రశ్నించారు.

**దిగివచ్చిన వైసీపీ.. బొత్స మద్దతు**

మంత్రి లోకేశ్ ప్రశ్నతో ఇరకాటంలో పడిన వైసీపీ, చివరకు ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ప్రకటించింది. మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. "స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఎవరు ప్రయత్నించినా మా సంపూర్ణ సహకారం, మద్దతు ఉంటాయి" అని తెలిపారు. అయితే, మరోవైపు వైసీపీ సొంతంగా ఓ తీర్మానాన్ని సభ ముందుకు తీసుకురాగా, దానిని అధికార పక్షం అసందర్భంగా అభివర్ణించింది. "మేం ఇప్పటికే స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించే పనిలో ఉన్నాం. ఆరు నెలల కిందట రాసుకున్న డ్రాఫ్ట్‌ను ఇప్పుడు తీసుకువచ్చి ప్రయోజనం ఏంటి?" అని లోకేశ్ ఎద్దేవా చేశారు.

# పిసి ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయండి

**(మొదటి పేజీ తరువాయి)**

ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు- సమాచారం. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీ-వల ఊరట లభించింది. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ఈ నివేదికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను కేసీఆర్, హరీశ్‌రావుల పిటిషన్‌తోపాటు- అక్టోబరు 7కి హైకోర్టు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

**(మొదటి పేజీ తరువాయి)**

ఇందులో భాగంగా శ్రీవారి తరఫున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలోని పలు ప్రాంతాలను విద్యుద్దీపాల అలంకరణలతో కళ్లుమిరిమిట్లు- గొలిపేలా తీర్చిదిద్దారు. పూల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలను నేరుగా తిలకించేందుకు భక్తులు భారీగా చేరుకుంటున్నారు.

# 2026 మార్చి 31 వరకు పాత ఎమ్మార్పీతో అమ్మకాలకు అనుమతి

వ్యాపారులకు నష్టం జరగకుండా, అదే సమయంలో వినియోగదారులకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు అందేలా కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. పాత ఎమ్మార్పీ ధరలతో ఉన్న నిల్వలను 2026 మార్చి 31 వరకు అమ్ముకునేందుకు అనుమతినిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలు కచ్చితంగా ప్రజలకు చేరాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ నెల 22వ తేదీకి ముందు తయారైన లేదా ప్యాక్ చేసిన వస్తువులపై కొత్త ఎమ్మార్పీ స్టిక్కర్ వేయాల్సిన అవసరం లేదని, అయితే పాత ఎమ్మార్పీ స్టిక్కర్‌ను తొలగించకూడదని ఆయన స్పష్టం చేశారు. కంపెనీలు లేదా డీలర్లు వస్తువుల ధరలు తగ్గిన విషయాన్ని వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. వినియోగదారుల వ్యవహారాల శాఖ జారీ చేసిన ప్రకటన ప్రకారం, తయారీదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులు తమ ఉత్పత్తుల కొత్త ధరల వివరాలను డీలర్లకు తెలియజేయాలి. ఈ సమాచారానికి సంబంధించిన కాపీలను రాష్ట్ర తూనికలు, కొలతల శాఖ డైరెక్టర్, కంట్రోలర్‌కు కూడా పంపాల్సి ఉంటుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ఈ ధరల మార్పుపై విస్తృత ప్రచారం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 23)**

కూటమి ప్రభుత్వం ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల పైన శ్వేత పత్రం విడుదల చేయడంతో పాటు వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు డిమాండ్ చేశారు మంగళవారం నాడు స్థానిక సీఆర్ భవన్ లో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బిషన్న తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో 2లక్షల 30 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే వాటిని భర్తీ చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో నిరుద్యోగులు అత్యధిక సీట్లలో కూటమి నాయకులను గెలిపిస్తే అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తా ఉన్న నిరుద్యోగుల గురించి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు, ఆంధ్రప్రదేశ్




రాష్ట్రంలో పాలకులు మారుతున్నారు తప్ప నిరుద్యోగ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడైనా చందంగా ఉందని ఆయన విమర్శించారు, రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, జూనియర్ కళాశాలు, ప్రభుత్వ స్కూళ్లలో, లైబ్రరీలలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్న వాటి భర్తీకి ప్రభుత్వం తర్వాత చూడకపోవడంతో పేద మద్దతు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం కష్టంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, అదేవిధంగా కర్నూలు జిల్లా పారిశ్రామిక హబ్బు ఓర్వకల్లు పరిశ్రమల కోసం రైతుల నుండి వేల ఎకరాల భూములు సేకరిస్తున్నారు తప్ప, అక్కడ ఏర్పాట అయ్యే పరిశ్రమలలో ఇప్పటివరకు ఎంతమంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు అనే విషయాలను జిల్లా నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు మంత్రులు అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు తెలియజేయడంతోపాటు పారిశ్రామిక హబ్ లో ఏర్పాటు చేసే పరిశ్రమలలో స్థానిక యువతకే 75% ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జీవో తేవాలని ఆయన డిమాండ్ చేశారు, అసెంబ్లీ సమావేశాలు కేవలం అధికార పార్టీ నాయకులను పొగుడుకోవడానికి లేదంటే గతంలో వైసిపి ప్రభుత్వం చేసిన తప్పులను ఎత్తిచూపటమే తప్ప నిరుద్యోగులకు ఏం చేస్తున్నాం అని దానిపైన స్పష్టత లేకపోవడం బాధాకరమన్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య నిరుద్యోగులు కన్నెర్ర చేయకముందే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ గా నిరుద్యోగులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు శ్రీకాంత్, రసూల్, రామ్ నాయక్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు

# జక్కల చెరువు పొలం పిలుస్తుంది కార్యక్రమం

**గుత్తి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)**



అనంతపురం జిల్లా గుత్తి మండలం లోని జక్కుల చెరువు గ్రామంలో లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి అనంతపురం జె డి ఏ ఉమా మహేశ్వరీ పాల్గొన్నారు.. నాగరాజు రైతుయొక్క పత్తి పొలంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వక్కరు తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించు కోవాలని తెలిపారు..అదే విధంగా పత్తి పంటలో ఆశించు పురుగులు తెగుళ్లు వాటి నివారణ మరియి ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు తెలిపారు..అదేవిధం మండలానికి జిపసమ్ 30 టన్నులు వచ్చుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో గుత్తి ఏ డి ఏ వెంకటరాముడు గారు ఏవో టెక్నికల్ శశికల, వ్యవసాయ అధికారి ముస్తాక్ అహమ్మద్ నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు

# కన్నుల పండుగగా

## కాత్యాయనీ దేవి మహోత్సవం











**అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):**

వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం పాతూరు అనంతపురం వారి ఆధ్వర్యంలో శ్రీ మూకాంబిక, కాత్యాయనీ దేవి అలంకారములు ఏర్పాటు చేశారు. మంగళవారం ఆశ్వీజ మాసము శు ద్ధ విధియా దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రెండవ రోజు కార్యక్రమాన్ని అధ్యక్షులు శ్రీ చల్లా కృష్ణ రంగయ్య, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి దూపకుంట్ల సాయినాథ్ గుప్తా తదితరులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆలయ ధర్మకర్త గర్జాల నాగరాజు,సెక్రటరీ ఆరవేటి రత్నం పాల్గొని మూకాంబిక, కాత్యాయనీ దేవి అలంకారములను తిలకించారు. అందులో భాగంగానే వాసవి దేవాలయంలో గురుకృప సంగీత నృత్య కళానికేతన్ కూచిపూడి నృత్యము పట్నం శివకుమార్ ఆధ్వర్యంలో బాలికలు నృత్య ప్రదర్శన చేశారు. భక్తులు కూచిపూడి నృత్య ప్రదర్శనను తిలకించారు. దేవి శరన్నవరాత్రిలో భాగంగా వాసవి దేవాలయంలో ఈ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. బాలికల నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ మూకాంబిక కాత్యాయనీ దేవి కృపకు పాత్రులయ్యారు.

ఈ ఏడాది దసరా శరన్నవరాత్రులు తొమ్మిది రోజులు కాకుండా, 12 రోజుల పాటు జరగడం విశేషం.

# 175 నియోజకవర్గాల్లో ఎం.ఎస్.ఎం.ఇ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం

**కాకినాడ జిల్లా మల్లిశాల గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటును పరిశీలిస్తాం**

**అసెంబ్లీలో మాట్లాడిన పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 23)**



ఏర్పాటుచేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. అసెంబ్లీలో స్వల్ప వ్యవధి చర్చలో ఆయన మాట్లాడారు. కాకినాడ జిల్లాలోని జగ్గంపేట మండలం, మల్లిశాల గ్రామంలో 525 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుచేసేందుకు పరిశీలిస్తామన్నారు. రోడ్డు, ఎయిర్ పోర్టు, తగిన నీటి లభ్యతపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తామని తెలిపారు. ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు దుబాయ్ గవర్నమెంట్‌కు కొన్ని భూములు చూపించామన్నారు. ఈ 525 ఎకరాల భూమిని కూడా వారి దృష్టికి తీసుకెళతామన్నారు. లేదంటే ఏపీఐఐసీ ద్వారా ఎలా డెవలప్ చేయొచ్చన్న దానిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని మంత్రి టి.జి భరత్ తెలిపారు. తప్పకుండా ప్రతి నియోజకవర్గంలో ఒక ఎం.ఎస్.ఎం.ఇ పార్క్ ఏర్పాటుచేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికతో ముందుకు వెళుతున్నారన్నారు. ఇప్పటికే పలు పార్కులు ప్రారంభించామని, కొన్నింటికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. త్వరలో మరో 30 పార్కులు రెడీ అవుతాయన్నారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త విధానంతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్ వలనే గతంలో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు.

# మున్సిపల్ కార్యాలయం యందు పి 4 శిక్షణా కార్యక్ర మం

**గుత్తి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)**



అనంతపురం జిల్లా గుత్తి మున్సిపల్ ఆఫీసు యందు కమీషనర్ బి. జబ్బార్ మియా ఆధ్వర్యంలో పి4 శిక్షణా తరగతులు జరిగినవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అ త్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి 4 కార్యక్రమంలో లో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో గల ఆర్థికంగా సేవాభావంతో గల మా ర్గదర్శకుల వివరాలు మరియు బంగారు కుటుంబాలు అయిన సహాయం కోసం ఎదురుచూస్తు న్న వారి వివరాలు సేకరించి ప్ర భుత్వం మతియు ప్రయివేట్ వ్యక్తుల అనుసంధానముతో పేదరికాన్ని రూపు మాపుటకు ప్రభుత్వం వారు సంకల్పించిన సూచనల ప్రకారం పి 4 కు సం బంధించిన విధివిధానాలు మరి యు కార్యక్రమ నిర్వహణపై గు రించిన మాస్టర్ ట్రైనర్లతో సచి వాలయ సిబ్బందికి మున్సిపల్ కార్యాలయం యందు శిక్షణ కా ర్యక్రమం జరిగినది.కమీషనర్ బి.జబ్బార్ మియా.ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

# ఓబిసి మోర్చా జోనల్ సమావేశం

**పామిడి సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)**




అనంతపురంలో జరిగిన ఓబీసీ మోర్చా జోనల్ సమావేశం జిల్లా అధ్యక్షులు కొనగొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో మోర్చా జోనల్ సమావేశం నిర్వహించారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు గోపీ శ్రీనివాస్ మరియు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మల బొల్లిన అనంతపురం జిల్లా పామిడి మండలం బీజేపీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ పూజారి లక్ష్మీదేవి పార్టీ కోసం చురుగ్గా పార్టీ కోసం ముందుండి పనిచేస్తుందని అని తెలుసుకొని పూజారి లక్ష్మీదేవి కి సన్మానించారు ఈ కార్యక్రమంలో గోపి శ్రీనివాస్ , నిర్మల బొల్లిన , అనంతపురం బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనగొండ్ల రాజేష్ , సంది రెడ్డి బిజెపి నాయకులు శ్రీనివాసులు మురళి నాయక్ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి బిజెపి నాయకులు పాల్గొన్నారు

# దసరా ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది

## ఏంపి అంబిక లక్ష్మీనారాయణ

**అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):**

దసరా ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా పామిడి మండల కేంద్రంలో శ్రీ శ్రీ భావసార క్షేత్రియ అంబ భవాని, పురాతన భోగేశ్వర స్వామి, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానము లందు ఎంపీ అంబిక లక్ష్మీనారాయణతో కలిసి ఆలయ చైర్మన్ ముకుందరావు, మనోజ్, హరీష్, నాగార్జున ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం భవాని అమ్మవారు భోగేశ్వర స్వామి, శ్రీ చెన్నకేశవ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం పామిడి బస్సు స్టాప్ ఆవరణము నందు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీ తగ్గింపు, సవరణలు చేయడం ద్వారా ప్రజలకు అనేక ఉపయోగాలు ఉన్నాయని ఎంపీ తెలియజేశారు. ఆ తరువాత అనంతపురం నగరంలోని



పాతూరు, అంబేద్కర్ నగర్ లో దసరా మహోత్సవాలలో ఎంపీ అంబిక పాల్గొన్నారు.కాలనీ వాసులు ఎంపీకి ఘనంగా స్వాగతం పలికారు. అంబేద్కర్ నగర్ లో ప్రజలతో కలిసి దసరా మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఎంపీ తెలియజేశారు.చెరుకు తోట పవన్, శ్రీ లచ్చి, టిఎన్ఎఎఫ్ శివ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ తరువాత హౌసింగ్ బోర్డు నందు వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ వేద గాయత్రి దేవాలయంలో దసరా ఉత్సవాల్లో అంబిక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మరియు కమిటీ సభ్యులు ఎంపీ కి ఘన స్వాగతం



పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీ అంబిక మాట్లాడుతూ ఈ దసరా ఉత్సవాల్లో పాల్గొనడం, ప్రజలందరూ కలిసి సంతోషంగా దేవాలయాల దర్శనం చేసుకోవడం శుభాలు కలుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేశవ చంద్ర ,ఎస్పీ ప్రసాద్ ,మూల వెంకటేశ్వర్ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ వైద్య కమిటీ సభ్యులు నరసింహులు, రైల్వే డిఆర్సి నెంబర్, శివ ప్రసాద్ మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శిశువుల సౌభాగ్యానికి తల్లిపాలే శ్రీరామ రక్ష

## డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత

**అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు 45 లీటర్ల పాలు ఇచ్చిన మాతృమూర్తికి అభినందన**

**అనంతపురం వైద్యం, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):**



తల్లిపాలు తాగే శిశువులు పండంటి ఆరోగ్యంగా ఉంటారని, సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని, అందుకే తల్లిపాలు శిశువుల సౌభాగ్యానికి శ్రీరామ రక్షగా అభివర్ణించారు ప్రభుత్వ సర్వజనాస్పత్రి డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత. తల్లిపాలు తాగే శిశువులు తెలివిగా కూడా ఉంటారని కూడా ఆమె పేర్కొన్నారు. బిడ్డ బంగారు భవిష్యత్తుకు సాయపడే తల్లిపాలలో సహజంగానే జ్ఞాపకశక్తి దాగి ఉంటుందని, ఇది ప్రకృతి చేసే అద్భుతమని స్పష్టం చేశారు. అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొత్తగా ప్రారంభించిన అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు బెంగళూరులోని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా శాఖలో ఎలక్ట్రికల్ మేనేజర్ గా పని చేసే దర్శి లిఖిత 45 లీటర్ల పాలు ఇవ్వగా.. ఆ మాతృమూర్తిని మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ అనంతపురానికి చెందిన దర్శి లిఖిత ఈ ఏడాది ఏప్రిల్ 30న మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. లిఖిత తన బిడ్డకు పాలు ఇవ్వగా మిగిలిన పాలను సేకరించి, వాటిని భద్రపరిచి తమ మిల్క్ బ్యాంక్ కు దానం చేసి తన మాతృత్వాన్ని చాటుకున్నారని, అందుకు లిఖితను డాక్టర్ అభినందించారు. నెలలు నిండకుండా పుట్టిన, తక్కువ బరువుతో, ఆరోగ్య సమస్యలతో పుట్టిన, కవల పిల్లలు, అనారోగ్య కారణాలతో పాలు ఇవ్వలేని తల్లులకు పుట్టిన శిశువులకు నవజాత కేంద్రంలో అడ్మిట్ చేస్తారని వివరించారు. ఇలాంటి శిశువులకు సేకరించి, సురక్షితంగా భద్రపరచిన తల్లిపాలను ఇచ్చి శిశువుల సౌభాగ్యానికి దోహదపడటం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు న్యూట్రిషన్ బోయ సాయిపల్లవి తెలిపారు. అనంతరం 45 లీటర్ల పాలను దానం చేసిన దర్శి లిఖితను తల్లులు, సిబ్బందితో కలసి సత్కరించారు. ఆమె రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో ప్రతి తల్లి ముందుకొచ్చి పాలు దానం చేసి తమ మాతృత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ భాస్కర్ నాయక్, కౌన్సిలర్ డా.రాధ, స్టాఫ్ నర్సులు బోయ సుకన్య, రమ, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్ఐవితో జీవిస్తున్న వారందరికీ చికిత్స అందించాలి

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):**

హెచ్ఐవితో జీవిస్తున్న వారందరికీ చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్.ఐ.వి. నియంత్రణ కార్యక్రమాలను పర్యవేక్షించే జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

**జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్.ఐ.వితో జీవిస్తున్న వారందరికీ హెచ్ఐవి చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి అంచనాల ప్రకారం జిల్లాలో హెచ్ఐవితో జీవిస్తున్న వారిని అందరిని గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందించి, గుర్తించిన వారందరినీ ఏ.ఆర్.టి. కేంద్రాలలో నమోదయ్యేలాగా ప్రోత్సహించి వారందరికీ చికిత్స అందించాలన్నారు. హెచ్ఐవి చికిత్స తీసుకోవడం ద్వారా వారిలో హెచ్ఐవి వైరస్ నియంత్రించబడుతుందని, అందువల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి హెచ్ఐవి మందులు వాడేవారు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఏ.ఆర్.టి కేంద్రాలలో మందులు వాడేవారు రకరకాల కారణాలవల్ల ప్రతినెల మందులకు రావటం లేదని, మందులు సక్రమంగా వాడకపోవటం వల్ల వచ్చే ఆరోగ్యపర ఇబ్బందులను వారికి



తెలియజేసి మందులకు ఏ.ఆర్.టి కేంద్రాలకు వచ్చేలాగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాజిటివ్ నెట్ వర్క్ ప్రతినిధులు హెచ్ఐవితో జీవిస్తున్న వారిని కలిసి నచ్చజెప్పి ప్రతినెలా మందులు వాడేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఏయే వయస్సు వారు మరియు ఏయే వర్గాల ప్రజలు హెచ్ఐవి బారిన పడుతున్నారనే విషయాలను విశ్లేషించాలని, అందుకు అనుగుణంగా వ్యాధి నియంత్రణ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, వ్యాధి సోకే అవకాశమున్న హై రిస్క్ గ్రూపు వారినందరినీ గుర్తించి, వారికి కౌన్సిలింగ్ మరియు పరీక్షా సేవలను అందించాలని సూచించారు.జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఈ.బి.దేవి మాట్లాడుతూ జిల్లాలో హెచ్.ఐ.వి. నియంత్రణకు వైద్య, ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను, జిల్లాలో అందుబాటులో ఉన్న సదుపాయాలను కమిటీ సభ్యులకు వివరించారు. హెచ్.ఐ.వి. పరీక్షా కేంద్రాలకు వచ్చి పరీక్షలు చేయించుకోలేని వర్గాల కొరకు జిల్లాలో మొబైల్ ఐ.సి.టి.సి. వ్యాన్ ను ఇటీవల ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా హెచ్.ఐ.వి. ప్రభావిత ప్రాంతాల్లో హెచ్.ఐ.వి పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స సేవలకు పంపటం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిషత్ సిఈఓ శివశంకర్ మాట్లాడుతూ కాలేజి యువతకు హెచ్.ఐ.వి. పట్ల ఎక్కువగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా లేప్రసి, ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ కాలేజి యువతలో అవగాహన కొరకు రెడ్ రిబ్బన్ క్లబ్బులు ఏర్పాటు చేయటం జరుగుతోందని, అలాగే సమగ్ర ఐ.ఈ.సి. కార్యక్రమాల ద్వారా కాలేజి యువతలో అవగాహన కల్పించటం జరుగుతోందని తెలిపారు.ఈ సమావేశంలో డిపిఓ నాగరాజునాయుడు, ఇంచార్జి డిసిహెచ్ఎస్ డా.ఎల్లప్ప, ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, డెమో త్యాగరాజు, యువజన శాఖ అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ విద్యాధికారి బి.శ్రీనివాసులు, అనంత నెట్వర్క్ ప్రతినిధులు, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కిష్టప్ప, వారి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఉప్పాడ లో తీర ప్రాంతంలో ఏర్పాటు చేసిన కాలుష్యకారక పరిశ్రమలను తొలగించాలి







**కాకినాడ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్)**

యూ. కొత్తపల్లి ఉప్పాడ లో తీర ప్రాంతంలో ఏర్పాటు చేసిన కాలుష్యకారక పరిశ్రమలను తొలగించాలంటూ మత్స్యకారులు కతం తొక్కారు మత్స్య సంపద అంతరించే పోవడంతో జీవనం సాగించలేక మా ఆకలి కేకలు ఎవరికి వినిపించడం లేదు, అంటూ మంగళవారం ముప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో మత్స్యకారులు ధర్నా చేపట్టారు సముద్రంలోకి నేరుగా కలిసిత జలాలు వదిలి వేయడంతో గత కొంతకాలంగా అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్న ఎప్పటికీ పట్టించుకునే దాఖనాలు లేవని వాపోయారు గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన సమస్యను పరిష్కరిస్తామని హామీ చేరే తప్ప చర్య మాత్రం తీసుకోలేదని తెలిపారు మత్స్య వేట తప్ప వేరే పని చేతగాని మత్స్యకారుల సమస్యను తీర్చకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ సర్పంచ్ ఉమ్మడి మేరీ జాన్, గంట విజయ్ కుమార్, మక్కా మణికంఠ, సూరడ రాజు, మత్స్యకార నాయకులు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## పుట్టినరోజు చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ జగన్మోహనరావు



**ఎన్టీఆర్ జిల్లా చండర్లపాడు సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**

చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో మేదరమెట్ల శ్రీనివాసరావు మనుమరాలి మొదటి పుట్టినరోజు వేడుకలో నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకు లతో కలిసి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ అక్కమ్మకు రూ.2 లక్షల LOC అందజేశారు



**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**

జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చలమల అక్కమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 2,00,000/- %LOC% పత్రాన్ని స్వయంగా అందజేశారు. ఈ సహాయం అక్కమ్మ తక్షణ శస్త్ర చికిత్స కోసం ఉపయోగపడుతుంది.

## వాంబే కాలనీలో 'విజయవాడ ఉత్సవ్' వైభవంగా ప్రారంభం



**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**



విజయవాడ సెంట్రల్ నియోజక వర్గం 60వ డివిజన్ వాంబే కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, %మీరా% బొండా ఉమామహేశ్వర రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ 11 రోజుల ఉత్సవాల్లో 3,000కి పైగా కళాకారులు 30 విభిన్న కళా కార్యక్రమాలు, కార్నివాల్, ఫైర్‌వర్క్, డ్రోన్ షోలు, మ్యూజికల్ కాన్సర్ట్‌లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాల లక్ష్యం ప్రజలకు ఆధ్యాత్మిక స్ఫూర్తిని అందించడం, సంస్కృతి, కళలను ప్రదర్శించడం, విజయవాడను దేశ స్థాయిలో సాంస్కృతిక కేంద్రంగా నిలిపే అవకాశం కల్పించడం అని ఆయన వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్నవారిలో: క్లస్టర్ ఇంచార్జి కంచి ధనశేఖర్, డివిజన్ అధ్యక్షులు బేవర సూర్య, బుగత శ్రీరాములు, ధర్మాన రాము, %ఖ% రామరాజు, మైనంపాటి సుబ్బలక్ష్మి, రమేష్, జనసేన బెనర్జీ, గోపితదితరులు.

# బధిరుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 23,(రిపబ్లిక్ న్యూస్):**

బధిరుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు . మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో జిల్లా విభిన్న ప్రతిభావంతులు,హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బధిరుల మరియుసైన్ లాంగ్వేజ్ దినోత్సవకార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్,ప్రత్యేకఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తొలుత అంతర్జాతీయబధిరుల మరియు సైన్ లాంగ్వేజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. వినికిడి లోపం అనేది ఒక బలహీనత కాదని అది ఒక ప్రత్యేకమైన జీవనశైలి అని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో వినికిడి లోపం ఉన్నవారు ఒకఅంతర్భాగమని వారందరూ కూడా మనలాగే కలలు ,ఆశయాలు ,సామర్థ్యాలు కలిగిఉంటారని ముఖ్యంగా సైగల భాష ద్వారా వారు తమ భావాలను,ఆలోచనలను వ్యక్తపరచగలరని తెలిపారు. బధిరులను ఆత్మీయంగా పలకరించే క్రమంలో సైగల భాషను నేర్చుకోవడం ద్వారా వారితో మరింత సులువుగా ఉండ వచ్చునని, అలాగే వారి ఆలోచనలు భావాలను కూడా గుర్తించేందుకు వీలుంటుంది అని అన్నారు. కేంద్ర రాష్ట్ర. ప్రభుత్వాలు సమాజంలో వినికిడి లోపం ఉన్న వారిని అన్ని విధాల ఆదుకునేందుకు వారినిఅనేకవిధాలకార్యక్రమాల ద్వారా అవకాశాలు కల్పించడం జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్య ఉద్యోగం ఆరోగ్య సంరక్షమ వంటి రంగాలలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు కలెక్టర్ గారు తెలిపారు. ఇందులో భాగంగా వైద్య శిబిరాల ఏర్పాటు పాఠశాలల్లో సైగల భాష ఉపాధ్యాయులు నియమించడం, అర్హులకు ప్రభుత్వఉద్యోగాలుకల్పించడం, పని ప్రదేశాలలో సైగ భాషలో సంభాషించే విధంగా అవకాశం కల్పించడం వంటివి జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. బదురుల సంక్షేమం కొరకు అనంతపురం జిల్లాలో ఇప్పటివరకు 45 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని అలాగే అర్హులైన 6, 707 మంది బదురులకు పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతున్నట్లు తెలిపారు.బధిరులు కూడా మనోధైర్యంతో ముందుకు సాగుతూ అన్ని రంగాలలోనూ విజయం సాధించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా బధిరుల సమస్యలనుపరిష్కరించుటకు తన వంతు సహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అలాగే బధిరుల ఉన్నతికి సంబంధిత శాఖలు మానతా దృక్పథముతో పర్యవేక్షణ చర్యలు తీసుకొని వారిని తగినంతగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బధిరులలో కూడా అనేక ప్రతిభ పటవాలు నైపుణ్యాలు ఉంటాయని వాటిని గుర్తించి సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవాదృక్పథంతో సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా అర్హులకు శ్రవణ యంత్రములు ల్యాప్ టాప్ లు, టచ్ ఫోన్లు తదితర వాటిని పంపిణీ చేయడం జరుగుతుందని అలిమ్కో ద్వారా జిల్లాలో 948 మంది బదిరులను శ్రవణ యంత్రంల కొరకు గుర్తించడం జరిగిందని త్వరలోనే వాటిని పంపిణీ చేస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. బదురుల సంక్షేమానికి సంఘం ఏర్పాటు కొరకు ప్రభుత్వ భవనం కావాలని అడిగినందున దీని పై అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అలాగే గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్నపుడు సి ఆర్ సి సెంటర్ ద్వారా అన్ని రకాల ఉపకరణాలు అందించామని అలాగే ఈ విభిన్న ప్రతిభా వంతుల కొరకు జిల్లా కార్యాలయంలో సిప్డా ద్వారా ర్యాంప్ లు , లిఫ్టు తదితర వాటి ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు తెప్పించి ప్రభుత్వానికి సమర్పించే విధంగాచర్యలుతీసుకుంటామని తెలిపారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులను 2011 జనాభా లెక్కల ప్రకారం లక్ష



మంది దాకా గుర్తించడం జరిగిందని ఇప్పటివరకు 50వేల మంది దాకా యుడిఐ డి కార్డులు మంజూరు కాగా మిగిలిన 50 వేల మందికి వీలైనంత త్వరగా గుర్తింపు కార్డులను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభా వంతుల చైర్మన్ శ్రీ గడుపుటి నారాయణ స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బదిరులకు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభిన్నప్రతిభావంతులకార్పొరేషన్ ద్వారా బహిరులకు అవసరమైన సేవలను అందిస్తామని ప్రస్తుతం టచ్ ఫోన్ లు , ల్యాప్ టాప్ లుకూడా ఇస్తున్నామని ఈ ప్రభుత్వం అన్ని విధాలా బదురుల సంక్షేమానికి కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతివాంతుల శాఖ ఏడి అర్చన సర్వ శిక్ష అభియాన్ పిడి శైలజ, ఆర్డిటి ప్రతినిధి రఫీ, పలువురు బదిరుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు లక్ష్మీ నరసింహ రాఘవేంద్ర రామతుల్లా శ్రీరాములు ప్రిన్సిపాల్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం, ఆరోగ్యం- శుభ్రతపై చర్యలు తీసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి





**ఎన్టీఆర్ జిల్లా నందిగామ సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**

**1. నందిగామలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం**



నందిగామ ఏరియా హాస్పిటల్ లో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదేశాల మేరకు, లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన పదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు. ఆయుర్వేదం తక్కువ ఖర్చుతో సమర్థవంత మైన వైద్యం అని, అందరూ దీన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. **2. వీధి వ్యాపారులకు లోక్ కళ్యాణ్ మేళ**

నందిగామ బాబు జగజ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్‌లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించి న లోక్ కళ్యాణ్ మేళ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొని, వీధి వ్యాపారుల సంక్షేమానికి ఇది ఎంతో ఉపయోగకరమని, అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**3. "హాలో చైర్మన్" కార్యక్రమం లో తక్షణ చర్య**

"హలో చైర్మన్" కార్యక్రమం ద్వారా స్థానికుల ఫిర్యాదు తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నందిగామ%-% మధిర రోడ్డులోని చిన్న బ్రిడ్జి వద్ద ఉన్న చెత్తను వెంటనే శుభ్ర పరచేలా సిబ్బందిని ఆదేశించి, దగ్గరుండి పర్యవేక్షించారు.

## శానిటేషన్ వర్కర్స్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి - సీఐటీయూ డిమాండ్

**ఎన్టీఆర్ జిల్లా నందిగామ సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**




నందిగామ మండల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో బి.లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, పండుగలు సమీపిస్తున్న దృష్ట్యా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికులకు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం ?26 వేల రూపాయలు ఇవ్వాలని, స్కూళ్లలో అదనపు పనిభారం తగ్గించాలని, ప్రమాద బీమా, హెల్త్ కార్డులు, నాలుగు జతల యూనిఫారాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు మైమున్, వరలక్ష్మి, లావణ్య, అన్నపూర్ణ, సువార్త బేబీ, వసంత, కమలమ్మ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు



**ఎన్టీఆర్ జిల్లా నందిగామ సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం పున్నవెల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పార్టీ కార్యకర్త పరిమి ఆదాం బాబు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## కుప్పంలోఘనంగా ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం








**శాంతిపురంబీ సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)**ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, కుప్పం నందు ఆయుర్వేద దినోత్సవ మరియు స్వస్థ నారీ స్వస్తిక్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేద దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 23న జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది ఆయుర్వేదాన్ని శాస్త్రీయ సంపూర్ణ వైద్య విధానంగా ప్రచారం చేయడానికి అలాగే ఆరోగ్య సంరక్షణ సుస్థిరతలో కీలకపాత్రను గుర్తు చేయడానికి ఆయుర్వేద దినోత్సవం జరుపుకోవాలని కేంద్రం పేర్కొంది, ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాన్ని దైవం శ్రీ ధన్వంతరి స్వామి పూజా కార్యక్రమాల్లో నిర్వహించడం డాక్టర్ హేమలత ఆయుర్వేద వైద్యాధికారిణి, ఆయుర్వేద వైద్యం పై అవగాహన కల్పించడం జరిగింది స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్, కార్యక్రమంలో భాగంగా మహిళలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి ఆయుర్వేద మందులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా వారికి యోగ ఇన్స్ట్రక్చర్ గణేష్ పవిత్ర యోగాసనాలు ప్రాణాయామం ధ్యానం వంటివి నేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్కువ ప్రజలు హాజరయ్యారు

## జీఎస్టీ సంస్కరణలతో వినియోగదారులకు లాభం - లంకా దినకర్



**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపనుందని 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. బీసెంట్ రోడ్డులోని చార్టర్డ్ అకౌంటెంట్ భవన్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ రిఫార్మ్స్ ప్రత్యక్ష లబ్ధి చేకూరుస్తాయని పేర్కొన్నారు.నూతనంగా అమలులోకి వచ్చిన జీఎస్టీ రేట్ల పునర్వ్యవస్థీకరణ (5%, 18%) వల్ల నిత్యావసర వస్తువులు, మందులు, విద్యా అవసరాలు చౌకబడి, వినియోగదారులపై భారము తగ్గుతుందని వివరించారు. 1500 %జజ% లోపు వాహనాలు, సిమెంట్, వ్యవసాయ పరికరాలు వంటి అనేక వస్తువుల ధరలు తగ్గుతాయని తెలిపారు.జీఎస్టీ సంస్కరణల మేలు వినియోగదారులకు తప్పని సరిగా చేరేలా చార్టర్డ్ అకౌంటెంట్స్, చాంబర్ ఆఫ్ కామర్స్, స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహనకార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

"దేశంలోనే తొలిసారిగా జీఎస్టీ సంస్కరణలకు మద్దతుగా తీర్మానం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు" అని దినకర్ తెలిపారు.90% కుటుంబాల కొనుగోలు శక్తి పెరుగుతుందని, పొదుపు పెరిగి, వాణిజ్యం సులభతరం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# గుంతను పూడ్చిన దుర్గ భవాని స్వాములు





**మల్లాపూర్ సెప్టెంబరు 24 (రిపబ్లిక్ న్యూస్)**మల్లాపూర్ మండల కేంద్రం నుంచి మెట్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి సిరిపురం గ్రామం వద్ద పెద్ద గుంత ఏర్పడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇది గమనించిన మండలంలోని సిరిపూర్ దుర్గ భవాని స్వాములు మంగళవారం శ్రమదానం చేశారు. రోడ్డుపై ఉన్న గుంతలను సిమెంట్, కంకర కలిపి పూడ్చివేశారు. శ్రమదానం చేసి సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చిన భవాని స్వాములను ప్రయాణికులు, గ్రామస్తులు, పలువురు అభినందించారు.

# కళ్యాణ లక్ష్మీ, షాధి ముబారక్ , సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్

**మల్లాపూర్ సెప్టెంబరు 24 (రిపబ్లిక్ న్యూస్)**
మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో గారి కార్యాలయంలో మల్లాపూర్ మండలానికి చెందిన 31,03,596/- ముప్పై ఒక లక్షల మూడువేల ఐదువందల తొంభై ఆరు రూపాయల విలువగల 31 కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను..మరియు 6,74,500/- ఆరు లక్షల డెబ్బై నాలుగు వేల ఐదు వందల రూపాయల విలువగల 26 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు అందించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు... కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ప్రగతి కుంటుపడిందన్నారు..కరోనా



కష్ట కాలం లోనూ పింఛన్లు అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికే దక్కుతుందన్నారు.. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించి, కల్లబొల్లి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు...యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు యూరియా కొరత లేదని..ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్క హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చలేదన్నారు.ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పోయిందన్నారు.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ ను ఆదరించాలని కోరారు...ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాస్, మాజీ జడ్పిటిసిలు సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డీలర్ మల్లయ్య, మల్లాపూర్ పి.ఎ.సి.యస్.చైర్మన్ వెంపేట నర్సారెడ్డి, మాజీ సర్పంచులు రంగు రామాగౌడ్, బిట్ల నరేష్,విఎస్ఎస్ చైర్మన్ కలుసాని రాజన్న,మూడంపల్లి రమేష్, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బషీరాబాద్ మండలం లో ఎక్సైజ్ అధికారుల సూపర్ డ్రైవ్

## -ఐదు గురి పై కేసు నమోదు -సీఐ అదిశేషు



**బషీరాబాద్ సెప్టెంబర్ 23 ( ప్రజా రిపబ్లిక్)**వికారాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి అద్వరం లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం ఉదయం బషీరాబాద్ మండలంలోని కొత్లాపూర్ తాండా, నంద్యనాయక్ తాండా, వాల్యనాయక్ తాండా, జమ్లనాయక్ తాండా లో సూపర్ రెడ్స్ నిర్వహించారు. ఈ దాడులలో నాటు సారాయి తయారీ కోసం ఉపయోగించే (350) లీటర్లు బెల్లం పానకం ధ్వంసం చేసి, (09) లీటర్ల నాటు సారా సీజ్ చేసి, అయిదుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు తాండూరు ఇంచార్జి ఎక్సైజ్ సీఐ ఆదిశేషు తెలిపారు. నాటు సారా తయారీ, అమ్మడం పై నిషేధం ఉన్నందున ప్రజలు వాటి జోలికి వెళ్లరాదని, బైండోవర్ చేసిన తరువాత కూడా నాటు సారా కేసులలో పట్టుబడితే బ్రీచ్ అఫ్ బాండ్ కింద రెండు లక్షల జరిమానా ఉంటుందని, అవసరం అయితే పీడీ యాక్ట్ కింద కూడా కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఈ రైడ్లో కొడంగల్, మోమిన్పేట్, వికారాబాద్, డిటిఎఫ్ బృందాలు బషీరాబాద్ పాల్గొన్నాయని తెలిపారు.

# హెల్త్ సెంటర్లను సందర్శించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

## ఆహారం కలుషితం కారణంగా రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లోచికిత్సలు పొందుతున్న వారిని పరామర్శించిన కలెక్టర్.

## ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను ఆరా తీసిన కలెక్టర్.

సెప్టెంబర్23( రిపబ్లిక్ న్యూస్)మెదక్
నాణ్యమైన వైద్య చికిత్సలు అందడంతో విద్యార్థులందరూ సేఫ్ జోన్ లోకి వెళ్లడం జరిగిందనిప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో పరిశుభ్రమైన వంట ప్రాధాన్యతనిస్తూ ఆహారం కలుషితం కాకుండా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ యాజమాన్యాలను ఆదేశించారు.
మంగళవారం రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించి కలుషిత ఆహారం వల్ల విద్యార్థుల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేగుంట మండలం ఇబ్రహీంపూర్ మదర్ శాల ముస్లిం ప్రైవేట్ వసతి గృహంలో బీహార్ రాష్ట్రానికి సంబంధించి పిల్లలు 25 మంది వసతి పొందుతున్నారని 23-09-2025 సోమవారం రాత్రి వారు తీసుకున్న భోజనంలో నాణ్యత



లోపించి 10 మంది వాంతులు, విరోచనాలతో అస్వస్థత గురి కావడం జరిగిందని పదిమంది తీవ్ర అస్వస్థతను దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్ లో రామాయణం పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు తరలించడం జరిగింది అన్నారు తక్షణ సహాయ చర్యలపై
వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే వరకు వైద్య సేవలు అందించాలని రామాయంపేట వైద్యాధికారులకు అధికారులకు సూచించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. కలుషిత ఆహారం సంఘటనపై పూర్వోపరాలు తెలుసుకోవడానికి మెడికల్ బృందాన్ని కమిటీగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు, విద్యాసంస్థలు, హోటల్స్ రెస్టారెంట్లను ఆహారం పరిశుభ్రతలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.ఆరోగ్యంగా ఉండటానికి వంటగదిని, ఆహారాన్ని శుభ్రంగా ఉంచుకోవడం. ఆహారాన్ని వండే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పాత్రలు, కట్టింగ్ బోర్డులను శుభ్రంగా ఉంచడం, తాజా పదార్థాలను వాడటం, వండిన ఆహారాన్ని సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం వంటివి పరిశుభ్రమైన వంటలో ముఖ్యమైనవిగా పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రామాయంపేట తాసిల్దార్ రజని, డాక్టర్ శివ దయాల్, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# రాయికల్ చికెన్ సెంటర్ మాంసాహారా దుకాణలా వద్ద కుక్కలు కనిపిస్తే కుక్కలకు వ్యర్థ పదార్థాలు వేసినట్టు అయితే ఆ షాప్ యజమానులకు 5000 రూపాయలు జరిమానా

## -రాయికల్ మునిసిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్







**రాయికల్ పట్టణం, సెప్టెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల జిల్లా రాయికల్ చికెన్ సెంటర్ వద్ద వర్ధపదార్థాలు కుక్కలకు పారవేసినట్టయితే ఆ చికెన్ సెంటర్ల యాజమాన్యం కు 5000 రూపాయలు జరిమాన విధిస్తామని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ తెలిపారు పట్టణంలో కుక్కల బెడద ఉన్నమాట వాస్తవమే కానీ ఎవరైనా ఇంటికి వస్తే వారికి కుక్కలకు అన్నం పెట్టాలని మాంసాహారం పెట్టవద్దని మాంసాహారం తింటే మాంసాహారముకు అలవాటు పడి మనుషుల మీదికి కరుస్తున్నాయని తెలిపారు ఇలా ఉండగా ప్రజలు చాలామంది కుక్కల విషయంలో కంప్లీట్లు ఉన్నాయని ముఖ్యంగా చికెన్ సెంటర్ మటన్ షాప్ చాపల షాపు అక్కడ కుక్కలు ఎక్కువ ఉంటున్నాయని వీటిని నిర్మూలించడానికి వ్యర్థ పదార్థాలను ఒక డబ్బలలో వేసి మా చెత్త బండికి ఇవ్వాలని ఒకవేళ చికెన్ సెంటర్ ల వద్ద మటన్ షాపుల వద్ద చాపల చాపల షాపు వద్ద కుక్కలకు మాంసాహారు ముక్కలు వేస్తే వారికి 5000 రూపాయలు జరిమానా విధిస్తామని ఆ షాప్ యజమాను గమనించలని తప్పనిసరిజరిమానా ఉంటుందని ఎవరైనా ప్రజలు ఫోటో తీసి పంపిన ఆ చికెన్ సెంటర్ చాపలదుకాణాల వద్ద ముక్కలు వేసేవారికి ఫోటో తీసి పంపిన ఆ షాప్ యాజమాన్యం పై 5000 రూపాయలు జరిమానా విధిస్తామని మునిసిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ హెచ్చరించాడు

# రాయికల్ తాసిల్ కార్యాలయం నుండి భూభారతి సాదా బైనామాల2020లో దరఖాస్తు చేసిన వారికి తాసిల్ ఆఫీస్ నుండి దరఖాస్తులు అందజేస్తాము

## - రాయికల్ తాసిల్దార్ నాగార్జున వెల్లడి

**రాయికల్ పట్టణం,సెప్టెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కెసిఆర్ ప్రభుత్వం ఉండగా2020 సాదా బైనామాలకు కొరకు దరఖాస్తులు మీసేవ ద్వారా తీసుకున్నారు వాటిని భూభారతి లో క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు రాయికల్ తహసీల్దార్ ఆఫీసులో తాసిల్దార్ నాగార్జున సమీక్షిస్తూ ఈ రెండు మూడు రోజుల్లో వీటిని ఆయా లబ్ధిదారులకు అందజేస్తామని తాసిల్దార్ నాగార్జున తెలిపారు ఈసాధ బైనామాల కొరకై కార్యాలయంలోఏలాంటి పనులు చేయకుండాఈసాధన బై నామాల కొరకై ప్యాసి కార్యాలయంలో అందరూ సాధపైన మాలదిన్నె నిమజ్జనం ఉన్నారని ఇంత తొందర అయితే అంత తొందర గా లబ్ధిదారులకు అందజేస్తామని నాగార్జున అన్నారు ఇది ఇలా ఉండగా భూభారత్ ద్వారా గతంలో ప్రతి గ్రామానికి వెళ్లి ఆయా లబ్ధిదారులకు అప్లికేషన్ తీసుకొని 15 ఆగస్టు లోపు పనులు పూర్తి చేస్తామని ఇప్పటివరకు 120 దరఖాస్తులు క్లియర్ చేశారని మొత్తం 1834 మండలంలో వచ్చాయని అధికారులు తెలిపారు ఇప్పటికి మూడు నెలల గడుస్తున్నా అట్టి 1834లో 120 మాత్రమే ఒకే చేసినట్లు అధికారులు చెప్పారు



**ప్రభుత్వం వాగ్దానం చేస్తుంది కానీ ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదుఅని రైతులంటున్నారు**

భూభారతి దరఖాస్తులు తిరిగి రైతులకు అందించే ముందు వారం రోజులు అని వ్రాసి ఉంది కానీ పనులు మాత్రం తాసిల్ కార్యంలో జరగడానికి రైతులు పోయి అడిగితే నాకు ఆ పని ఉంది ఈ పని ఉందని రైతులు విసిగిస్తున్నారు మరి ఏ పథకమైన అధికారులతో చర్చించి పథకాలు ప్రవేశపెట్టాలి కానీ పనులు చేయకుండా అధికారులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం బాగోలేదు రైతు లేని రాజ్యం లేదు అని అన్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయం తెలియకపోవచ్చు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయంలో ఈ పనులైనా మందకోడి అంటే అది కేవలం రెవెన్యూ కార్యాలయాలు ఈ విషయంలో ప్రభుత్వం దూరదర్శన్ తో పరిశీలించి ముందు భవిష్యత్తు వచ్చే రైతులు ఇలా చేయవద్దని రైతులు అంటున్నారు




# అంగన్వాడి కార్యకర్తలకు తాసిల్ కార్యాలయంలో బూత్ లెవెల్ స్థానిక ఎన్నికల నియమాల కొరకై సమావేశం

**రాయికల్ పట్టణం, సెప్టెంబర్ 23, ( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికల కొరకై అంగన్వాడి కార్యకర్తలతో తాసిల్దార్ కార్యాలయంలో గిరిధవార్ దాసరి పద్మయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికల కొరకై అంగన్వాడి కార్యకర్తలతో సమావేశమయ్యారు అన్ని గ్రామాల నుండి



అంగన్వాడి కార్యకర్తలు హాజరై బూత్ లెవెల్ కొరకై ఆఫీసర్లుగా అన్ని విషయాలను గిరిధవర్ దాసరి పద్మయ్య తెలిపారు తర్వాత తాసిల్దార్ నాగార్జున హాజరై బూతులేవాల్ ఆఫీసర్లుగా అంగన్వాడి కార్యకర్తలకు తగు సూచనలు చేశారు నిర్లక్ష్య పనికిరాదని సక్రమంగా పనిచేయాలని హితవు పలికారు ఇదిలా ఉండగా తాసిల్ కార్యాలయంలో సమావేశం గది చిన్నదిగా ఉండటం వల్ల తాసిల్ కార్యాలయం ముందు అంగన్వాడి కార్యకర్తలు కూర్చోవడం జరిగింది

# బాల త్రిపుర సుందరీ దేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ

## పట్టు వస్త్రాలు సమర్పించిన చల్లా రామచంద్రారెడ్డి దంపతులు

**చౌడేపల్లి సెప్టెంబర్ 23 రిపబ్లిక్ న్యూస్**
ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బోయకొండ గంగమ్మ దేవస్థానము నందు జరుగుచున్న దసరా మహోత్సవము సందర్భముగా మొదటి రోజు మంగళవారం అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చినారు. ఈ అలంకారమునకు ఉభయదారులుగా చౌడేపల్లి కి చెందిన పిల్లారి జీవన్ ప్రకాష్ కుటుంబ సభ్యులు పుంగనూరు గీతాదేవి లబురామ్ భవాని జువెల్లర్స్, శిల్పా ముకేష్, మహా లక్ష్మి ఏజెన్సీస్ ఒంటిమిట్ట నాయునివారు ఉభయదారులుగా పాల్గొన్నారు. ఉభయదారులతో గణపతి హోమము, చండీ హోమము నిర్వహించినారు.
దసరా మహోత్సవములకు మంగళవారం పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి చల్లా రామచంద్ర రెడ్డి దంపతులు వారి కుటుంభ సభ్యులతో విచ్చేసి అమ్మవారికి పట్టు వస్త్రములు సమర్పించినారు. ఈ కార్యక్రమములో



దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఏకాంబరం చల్లా రామచంద్రారెడ్డి దంపతులకు బాల త్రిపుర సుందరీ దేవిగా కొలువుతీరిన బోయకొండ గంగమ్మ దర్శన భాగ్యం కల్పించారు .అనంతరం యాగశాలలో వేద ఆశీర్వాదం తీర్థప్రసాదాలు అందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి నాయకులు లక్ష్మీపతి రాజు,



బోయకొండ సుబ్బు ,అనూష్ రాయల్, రెడ్డి ,సోమశేఖర్ అర్జున్ రాయల్, ముని, పవన్ దేవస్థాన అర్చకులు, సిబ్బంది

# గాయత్రి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సవిత, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ , పత్సమట్ల ధర్మరాజు

**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**
దసరా శరన్నవరాత్రుల సందర్భంగా గాయత్రి దేవి అలంకృత అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాల కోసం ప్రభుత్వం పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు, కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. అలాగే రెండవ రోజు గాయత్రి అవతారంలో అమ్మవారిని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకున్నారు. వారు రాష్ట్ర సుభిక్షత, ప్రజల ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని ప్రార్థించారు.



# బ్రాహ్మణుల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తా

## రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చి రామ్ ప్రసాద్

**ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి సెప్టెంబర్23 (రిపబ్లిక్ న్యూస్)**
విజయవాడ గొల్లపూడిలో బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమక్షంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.బుచ్చి రామ్ ప్రసాద్ మాట్లాడుతూ,"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయంతో బ్రాహ్మణుల అభివృద్ధికి అన్ని పథకాలతో కార్పొరేషన్‌ను పునరుద్ధరిస్తాం. దేవాలయాల అభివృద్ధి,హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టంగా కనిపిస్తుంది" అన్నారు.



ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. కొత్తగా 380 దేవాలయాలకు ధూప దీప నైవేద్యం మంజూరు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదే" అని తెలిపారు.
చైర్మన్‌ను అభినందించిన వారు: ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఏపీ ఎన్ఆర్ఐ చైర్మన్ వేమూరి రవి, బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ ఎం.చిన్నబాబు, సీఈవో నాగ సాయి, సీనియర్ మేనేజర్ హెచ్.ఆర్.ఎల్. శ్రీనివాస్ తదితరులు.

# మహిళల ఆరోగ్యంతోనే బలమైన కుటుంబం

**నాడు డయాలసిస్ కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది**

**నేడు కోరుట్లలోనే సెంటర్ ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ దే**

**కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**



**కోరుట్ల టౌన్, సెప్టెంబర్ 23 (రిపబ్లిక్ న్యూస్)** ఆరోగ్యవంతమైన మహిళలతోనే బలమైన కుటుంబంగా నిలుస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో మంగళవారం స్వస్థ నారీ..సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మహిళా ఆరోగ్యంతో ఉండాలన్న ఉద్దేశ్యంతో మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించడంకోసం ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రవేశపెట్టబడిందన్నారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజలు నాడు డయాలసిస్ కొరకు హైదరాబాద్ కు వెళ్ళేవారని, నేడు కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయించుకుంటున్నారన్నారు. కెసిఆర్ హయాంలోనే కోరుట్ల ప్రభుత్వాసుపత్రి 100 పడకల ఆసుపత్రిగాను, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు భరోసా,మిషన్ భగీరథ వంటి పథకాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత దేశంలో అమలులోకి వచ్చాయని, తల్లి, బిడ్డ క్షేమం కొరకు కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ అందజేశారని, నేడు ఇది అమలులో లేక పోవడంతో గర్భవతులకు సరైన పోషకాలు కలిగిన ఆహారం అందడం లేదన్నారు. ఇకనైనా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గర్భవతులకు న్యూట్రిషన్ కిట్ అందజేయాలన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన బోర్ పంపును గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన ఐమాస్ లైట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ప్రమోద్ కుమార్, డాక్టర్ మణిదీప్, డాక్టర్ తబుస్సుమ్, ధనుంజయ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బషీరాబాద్ మండలం లో జోరుగా బాల్య వివాహాలు

**-గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో పెళ్లిళ్లు**




**బషీరాబాద్ సెప్టెంబర్ 23( ప్రజా రిపబ్లిక్ )** బషీరాబాద్ మండలం లో బాల్య వివాహాలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని సూచనలు చేసిన, హెచ్చరించిన మండలం లో బాల్యవివాహాలు మాత్రం ఆగడం లేదు. బాలికలు కనీస వయసు లోకి రాక ముందే ఎవరికీ కనపడకుండా రాత్రి సమయం పెళ్లి లు చేసి వదిలేస్తున్నారు. విద్యార్థులు చదువులను కొనసాగించకుండా మధ్య లోనే నిలుపుదల చేసి చిన్న వయసు లో పెళ్లి లు చేసి వారి బతుకులను చీకట్లో కి తోసేస్తున్నారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే ముందు ముందు జరిగే పరిణామాలు తల్లిదండ్రులకు తెలిసిన కూడా వివహాలు చేస్తూ నరకం లోకి నెట్టేస్తున్నారు. బాల్య వివాహాల వల్ల విద్యకు దూరం అవుతూ, ఆరోగ్యానికి దగ్గర అవుతూ, హింసకు గురి అవుతున్నారు. గ్రామ స్థాయి లో బాల్యవివాహాల పైన సరైన అవగహన, నిఘా లేక పోవడం తోనే వారి భవిష్యత్తు అంధకారం గా మారిపోతుంది

## ఊరెళ్తున్నారా..జాగ్రత్త!!...

**- దసరా సెలవుల్లో ఇళ్ల భద్రత మీ చేతుల్లోనే.....**

**-కల్హేర్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్ఐ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమైన సూచనలు తెలపడం జరిగింది ఇంటి భద్రత కోసం ముఖ్యమైన సూచనలు...

ఇంట్లో బీరువా పైన తాళాలు పెట్టకండి.ఇంట్లో బంగారం, వెండి, నగదు పెట్టొద్దు బ్యాంక్ లాకర్ ఉంచండి...%CCTV% కెమెరా, అలారం, సెంట్రల్ లాక్ ఏర్పాటు చేసుకోండి....తాళం కనబడకుండా కర్టెన్ వేయండి, బయట గొళ్లం పెట్టవద్దు..ఒక గదిలో లైట్ ఆన్ చేసి ఉంచండి తలుపు ముందు చెప్పులు పెట్టండి...పేపర్/పాలు వేయించేవారికి సెలవు సమయంలో రావొద్దని చెప్పండి...ప్రయాణ వివరాలు సోషల్ మీడియాలో పంచుకోకండిఇంటి పక్కవారు/నమ్మకమైన వారికి, స్థానిక పోలీస్ స్టేషన్కి సమాచారం ఇవ్వండి.కొత్త వ్యక్తులు/డెలివరీ బాయ్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి.బస్సు/ రైల్లో అపరిచితులు ఇచ్చే తీసుకోకండి. తినుబండారాలు...మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్ కు కానీ,కల్హేర్ యస్ ఐ వాట్సప్ నంబర్ 8712656761కు సమాచారం తెలుపగలరు....

## 2 కోట్ల రూపాయలతో బంజారా భవనాన్ని మంజూరు చేయించినందుకు నారాయణఖేడ్ శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన బంజారా నాయకులు మరియు పెద్దలు








**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ నియోజకవర్గం
నారాయణఖేడ్ పట్టణంలోని వెంకటాపూర్ గేట్ వద్ద రామారావు మహారాజ్ ట్రస్ట్ స్థలంలో 2 కోట్ల రూపాయలతో బంజారా భవన్ మంజూరు చేయించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు మంత్రి దామోదర్ రాజనర్సింహ కి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్ కి ధన్యవాదాలు తెలిపినలినారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, పట్లోళ్ల చంద్ర శేకర్ రెడ్డీ, కలిసి ధన్యవాదాలు తెలిపిన బంజారా నాయకులు మరియు పెద్దలు అనంతరం బంజారా నాయకులు మరియు పెద్దలు మాట్లాడుతూ

గత పది సంవత్సరాల నుండి గిరిజనులకు కానీ గిరిజన తండాలకు కానీ ఏలాంటి అభివృద్ధి చేయలేదు గత టీఆర్ఎస్ ప్రభుత్వం అని వారు అన్నారు.తండాలలో చాలామంది పేద ప్రజలు వారి యొక్క వివాహాలు ఫంక్షన్ హాల్ లో చేయాలని వారికి ఎంతో కోరిక ఉండేదని కానీ కొంతమందికి ఆర్థికంగా డబ్బులు లేక తండాలోని వివాహాలు జరుపుకోవాల్సి వచ్చేదని కానీ మా యొక్క కలలను బంజారా భవన్ నిర్మించడంతో నెరవేరుతాయని పేద గిరిజనుల ప్రజలకు వివాహాలు చిన్న చిన్న శుభకార్యాలకు జరుపుకోవడానికి ఉపయోగపడుతుందని గిరిజన సోదరులు సంతోషం వ్యక్తం చేశారు.గిరిజనులకు మరియు గిరిజన తండలకు గతం లో మీ నాన్న స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి కాంగ్రెస్ పార్టీనే అభివృద్ధి చేసిందని మళ్ళీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ మీరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతనే గిరిజన ప్రజలు మరియు గిరిజన తండా లు అభివృద్ధి చెందుతున్నాయని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు నాయకులు బంజారా నాయకుడు మరియు, భవాని అమ్మవారి దీక్ష స్వాములు, శేఖర్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాలకు అండగా సీఎం సహాయనిధి

**- టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24రిపబ్లిక్ న్యూస్**
బడుగు బలహీన వర్గాలకు సీఎం సహాయనిధి చాలా అండగా నిలుస్తుందని జ్యోతి పండాల్ అన్నారు. కార్పొరేట్ హాస్పిటల్లో లక్షల్లో కోట్లల్లో డబ్బులు పెట్టుకొని వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా కొంతవరకైనా లబ్ధి పొందవచ్చు అని టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండాల్ అన్నారు. మొన్న వరంగల్లో టిఆర్పి పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరిగిన టిఆర్పి రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో బడుగు బలహీన వర్గాలకు అట్టడుగు పేద ప్రజలకి మా పార్టీ అధికారంలోకి వస్తే, ఉచిత వైద్యం అందించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలన్న సంకల్పంతో మా పార్టీ అధ్యక్షులు వివిధ వర్గాల పేద ప్రజల కోసం సీఎం సహాయనిధి ద్వారా సహాయం చేయాలని నిర్ణయించుకున్నాము. కావునజహీరాబాద్,నియోజకవర్గ ప్రజలందరూ కూడా నా ద్వారా సీఎం సహాయ నిధి కోసం అప్లై చేసుకోవాల్సిందిగా తెలియజేసుకుంటున్నారు.

## సేవాలాల్ మహారాజ్ రాంరావు మహారాజ్ భవాని మాత మరియు మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యే ,చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన బంజారా సోదరులు







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ పట్టణంలోని సేవాలాల్ భవానీ మాత మందిరం ఆవరణంలో సేవాలాల్ మహారాజ్ రాంరావు మహారాజ్ భవాని మాత మరియు మాజీ మంత్రి హరీష్ రావు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ గారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన బంజారా సోదరులు.వారు మాట్లాడుతూ..

గత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి హరీష్ రావు మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నారాయణఖేడ్ నియోజకవర్గం లో అన్ని తాండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేసి వాటికి నిధులను సాంక్షన్ చేయించి తాండాలను అభివృద్ధి చేసిన ఘనత వారికే దక్కుతుందని తెలిపారు.

నారాయణఖేడ్ పట్టణానికి దగ్గరగా జాతీయ రహదారి పక్కన 20 గుంటల స్థలాన్ని సుమారు కోట్లు విలువ చేసే స్థలాన్ని బంజారా సోదరుల కోసం వారి సామూహిక కార్యక్రమాల కోసం భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కేటాయించి రామరావు మహారాజ్ ట్రస్టు వారికి అందజేశారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలిమాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి బంజారా సోదరుల కోసం 10% రిజర్వేషన్లు అమలు చేశారని తెలిపారు. గతంలో మీరు 56 సంవత్సరాలు అధికారంలో ఉండి మీ నాయన ఎమ్మెల్యేగా,మీరు ఎంపీపీగా జెడ్పీటీసీగా ఉండి ఈమండలానికి ఈ నియోజకవర్గ బంజారా సోదరుల కోసం చేసింది ఏమీ లేదని అన్నారు.

అనంతరం బంజారా సోదరి సోదరీమణులు మాజీ మంత్రి హరీష్ రావు కి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి చిత్రపటాలకు హారతులు ఇచ్చి, వీరి పేరు మీద ప్రత్యేక పూజలు చేసి వారి సాంప్రదాయం ప్రకారం భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్లు రవి, కిషన్ నాయక్,మాజీ ఎంపీటీసీ రాజు నాయక్,నాయకులు వెంకట్ నాయక్, సర్దార్ నాయక్,బంగారు రాజు, రమేష్, శంకర్ నాయక్, దేవి సింగ్,భవానీ మాత మాల ధారణ స్వాములు, బంజారా సోదరులు తదితరులు ఉన్నారు.

# నగరపాలక నిధులతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే పెత్తనం ఏమిటి?

**ప్రోటోకాల్ పాటించాలని కమిషనర్ కు తెలియదా - నగర అభివృద్ధి చేసిన ఘనత వైసీపీ దే -నగర మేయర్ మహమ్మద్ వసీం**

**అనంతపురం కార్పొరేషన్, సెప్టెంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):**
తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న అనంతపురం నగరపాలక వర్గం వైసిపి పాలకవర్గమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అధికారులకు తెలియదా అని నగర మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని రాంనరేష్ ఫంక్షన్ హాల్ వద్ద రూ.2 కోట్ల నిధులతో ఎన్ క్యాప్ నిధులతో చేపట్టిన అభిరుద్ధి పనులు కార్పొరేషన్ కు సంబంధించినప్పటికీ మేయర్,డిప్యూటీ మేయర్, స్థానిక కార్పోరేటర్ కు కనీస సమాచారం ఇవ్వాలన్న కనీస ఆలోచన కమిషనర్ బాలస్వామి కి ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. నగర పాలక సంస్థలో ఎమ్మెల్యే కేవలం ఎక్స్ అఫీసియో సభ్యుడు మాత్రమే అని గుర్తించుకోవాలన్నారు. నగర పాలక సంస్థలో ఆమోదించిన పనులకు మాత్రమే భూమిపూజ జరిగిందని,మా నగర పాలక సంస్థ నిధులలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రమేయం ఏమిటని ఆయన ప్రశ్నించారు.నగర ప్రథమ పౌరుడు అయిన మేయర్ కు, స్థానిక కార్పొరేటర్ కు సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించని అధికారులపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఎన్క్యాప్ నిధులు కేంద్రం నుంచి వస్తాయని కనీసం ఎంపీ ని కూడా ఆహ్వానించాలని అధికారులకు తెలియకపోయినా స్థానిక ఎమ్మెల్యే సొంత పార్టీ ఎంపీకి సమాచారం



ఇచ్చారా లేదా అన్నది కూడా తెలియలేదు అన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నగర అభిరుద్ధి ఏమి చేయలేదని పదే పదే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు 15 రోజుల ముందు నగరానికి వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు కరోనా సమయం మినహా 3 ఏళ్లలో జరిగిన అభిరుద్ధి ఏమిటో మేమి చెపుతాము గుర్తించుకుని ఇకపై మాట్లాడేటప్పుడు గమనించాలని సూచించారు. వైసీపీ హయాంలో నగర అభివృద్ధి కోసం అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రూ.1045 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు ఐదేళ్ల పాలనలో జరిగాయన్నారు.18 నెలలలోనే రూ.300 కోట్లతో బళ్లారి బైపాస్ నుండి పంగల్ రోడ్ వరకు నగరం మీదుగా 4 వరసల రహదారితోపాటు టవర్ క్లాక్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించిన ఘనత మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అదే విధంగా రూ.90 కోట్లతో గుత్తి రోడ్ ను నాలుగు వరసల రహదారిగా తీర్చిదిద్దడం,రూ.300 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి ఎంసిహెచ్ బ్లాక్ నిర్మాణం, ఎన్ క్యాప్,14వ ఆర్థిక సంఘం నిధులు రూ68.72 కోట్లు,జనరల్,జీజీఎంపీ నిధులు 49.50 కోట్ల వ్యయంతో పలు అభిరుద్ధి పనులు చేపట్టడం,రూ.19 కోట్లతో సీడీ ఆసుపత్రి అభిరుద్ధి తోపాటు 6 అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మాణం వంటి ఎన్నో అభిరుద్ధి పనులు వైసీపీ ఐదేళ్ల పాలనలో అనంత వెంకటరామిరెడ్డి హయాంలో చేపట్టడం జరిగిందన్నారు.అదే విధంగా రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్ తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఇవన్నీ పార్ట్ టైం ఎమ్మెల్యే గా ఉన్నటువంటి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు తెలియని కనీసం తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా ఆయనకి ఎక్కడా కనిపించడం లేదన్నారు. వాస్తవాలు మాట్లాడాలని ఆయన సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు నరసింహులు,శ్రీనివాసులు,అనిల్ కుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు చింతకుంట మధు,నాగార్జున రెడ్డి,రామచంద్ర,కుళ్ళాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ధ్వని కాలుష్యం చేస్తున్న షాపింగ్ మాల్స్ పై చర్యలు తీసుకోవాలి

**RPI జిల్లా అధ్యక్షులు అలిగే జీవన్.**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ నియోజకవర్గం లో ధ్వని కాలుష్యం పెద్ద పెద్ద బాక్స్ లు, డీజే సౌండ్స్ తో ప్రజల ను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న షాపింగ్ మాల్స్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని అలిగే జీవన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల కు ఇబ్బందులు కలుగుతున్న అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తే ఆందోళన లు చేస్తామని ప్రభుత్వాన్ని అలిగే జీవన్ హెచ్చరించారు

